'సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగంలో కోట్లాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. నిత్యావసర సరకుల ధరలు దించుతాం. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలు తగ్గిస్తాం. రైతుల ఉత్పత్తులకు సరైన ధర కల్పిస్తాం. విద్వేష వాతావరణాన్ని చెదరగొట్టి సామరస్యాన్ని సాధించి చూపుతాం. ధన బలం, అధికార బలం లేకుండా చూస్తాం. దేశ పురోభివృద్ధిలో ప్రజలతో కలిసి నడుస్తాం. ముందుండి నడిపిస్తాం' అన్నారు.

సీడబ్ల్యూసీలో 50 శాతం వారికే

వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలు, మహిళలు, యువత, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ శనివారం కాంగ్రెస్ పార్టీ తన పార్టీ రాజ్యాంగానికి సవరణ చేసింది. సవరణ ప్రకారం పార్టీ నుంచి ప్రధానులైన నేతలు, మాజీ ఏఐసీసీ చీఫ్‌లకు సీడబ్ల్యూసీలో సభ్యత్వం ఉంటుంది. సీడబ్ల్యూసీ సభ్యుల సంఖ్యను 25 నుంచి 35కు పెంచారు. ఇకపై పార్టీలో కేవలం డిజిటల్ మెంబర్‌షిప్, రికార్డులను కొనసాగిస్తారు.

మూడో ఫ్రంట్‌తో ఎన్డీయేకే మేలు

మూడో ఫ్రంట్ అనే మాటే వినపడకుంటే భావసారుప్యత ఉన్న అన్ని పార్టీలను 'గుర్తించి', 'సమీకరించి', 'ఏకంచేసే' బృహత్తర పనికి వెంటనే పూనుకోవాలనే రాజకీయ తీర్మానం ముసాయిదాలో కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. 'కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకు లౌకిక, సామ్యవాద శక్తుల ఏకీకరణే అసలైన హాల్‌మార్క్‌గా నిలుస్తుంది. ఎన్డీయేకు వ్యతిరేకంగా విపక్షాలను ఐక్యం చేయాల్సిన అత్యవసరస్థితి ఇది. ఆలస్యం చేస్తే అది ఎన్డీయేకే మేలు చేస్తుంది' అని ముసాయిదాలో నేతలు ఆందోళన వ్యక్తంచేశారు.

'ప్రధాని ఆశతోనే కాంగ్రెస్, ఆర్జేడీతో దోస్తీ

బిహార్ సీఎం నితీశ్ కుమార్‌పై అమిత్ షా ధ్వజం

లారియా(బిహార్): బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్‌పై బీజేపీ అగ్రనేత అమిత్ షా ఆరోపణల వర్షం కురిపించారు. బిహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లాలోని లారియాలో శనివారం ర్యాలీలో అమిత్ షా ప్రసంగించారు. 'మూడేళ్లకోసారి నితీశ్‌కు ప్రధాని పీఠంపై ప్రేమ పుట్టుకొస్తుంది. అందుకే హఠాత్తుగా బీజేపీతో పొత్తును తెగతెంపులు చేసుకుని కాంగ్రెస్, ఆర్జేడీతో జట్టుకట్టారు. ఆయన పచ్చి అవకాశవాది' అంటూ నిప్పులు చెరిగారు.'బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ కంటే బీజేపీనే ఎక్కువ సీట్లు సాధించినా ఇచ్చిన మాట కోసం నితీశ్‌నే మోదీ ముఖ్యమంత్రి చేశారు. ఇకపై నితీశ్‌తో ఇక జట్టుకట్టేదిలేదు' అని తేల్చిచెప్పారు.

బెంగాల్‌లో కేంద్రమంత్రి కాన్వాయ్‌పై దాడి

దిన్హాటా: పశ్చిమబెంగాల్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిశిత్ ప్రామాణిక్ కాన్వాయ్‌పై తృణమూల్ కాంగ్రెస్ మద్దతుదారులుగా భావిస్తున్న వారు దాడికి పాల్పడ్డారు. కూచ్‌బెహార్ జిల్లా దిన్హాటా ప్రాంతంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. 'పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తుండగా టీఎంసీ కార్యకర్తలు నా కాన్వాయ్‌పై రాళ్లతో దాడి చేశారు. బాంబులు విసిరారు. కాల్పులు కూడా జరిపారు. దాడిలో పలువురు బీజేపీ కార్యకర్తలు గాయపడ్డారు. పోలీసులు చూస్తుండగా ఇవన్నీ జరిగాయి'అని మంత్రి ఆరోపించారు. ఈ సందర్భంగా టీఎంసీ, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టి, పరిస్థితిని సద్దుమణిగించారు.

ఎదురుకాల్పుల్లో నేలకొరిగిన ముగ్గురు జవాన్లు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జేగురుగొండ అటవీప్రాంతంలో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు డీఆర్జీ జవాన్లు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు, డీఆర్జీ బలగాలు జేగురుగొండ నుంచి దండకారణ్య అటవీ ప్రాంతంలో రోజువారీ గాలింపుల్లో ఉండగా కందేడ్ అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం మావోయిస్టులు కాల్పులు జరిపారు. ముగ్గురు జవాన్లు మృతి చెందగా గాయపడిన వారిని వెంటనే క్యాంప్‌కు తరలించి వైద్యమందించారు. రెండు ఏకే 47 తుపాకులు, 51 ఎంఎం మోర్టార్‌ను మావోయిస్టులు అపహరించారు. కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయి ఉంటారని పోలీసులంటున్నారు. వారి కోసం భారీగా కూంబింగ్ చేపట్టినట్టు బస్తర్ రేంజ్ ఐజీపీ సుందర్‌రాజ్ చెప్పారు.

ఆర్మీ జవాన్‌ను హతమార్చిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో శనివారం ఓ ఆర్మీ జవాన్‌ను మావోయిస్టులు హతమార్చారు. జిల్లాలోని బడెతెవాడకు చెందిన జవాన్ మోతీరామ్ సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. సమీపంలోని ఉసేలీ వారపు సంతలో కోడి పందేలు చూస్తుండగా ముగ్గురు మావోయిస్టులు మూడు రౌండ్ల కాల్పులు జరపడంతో మోతీరాం అక్కడికక్కడే మృతిచెందారు.


నేపాల్ కొత్త అధ్యక్షుడిగా పౌద్యాల్!

ఎనిమిది పార్టీల మద్దతు • ప్రమాదంలో ప్రచండ సర్కారు!

కాఠ్‌మాండూ: నేపాల్ నూతన అధ్యక్షుడిగా నేపాలీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రామచంద్ర పౌద్యాల్ ఎన్నికయ్యే అవకాశముంది. దేశాధ్యక్ష ఎన్నికల్లో భాగంగా శనివారం ఆయన అభ్యర్థిత్వానికి ఎనిమిది రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. కేపీ శర్మ ఓలీ నేతృత్వంలోని సీపీఎన్(యూఎంఎల్), పుష్పకమల్ దహాల్(ప్రచండ) నేతృత్వంలోని సీపీఎన్(మావోయిస్ట్ సెంటర్), మరో ఐదు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన సంగతి తెల్సిందే. అయితే కూటమి పార్టీ అయిన సీపీఎన్(యూఎంఎల్) బలపరిచిన అభ్యర్థి సుభాష్ నెబాంగ్‌కి కాకుండా అధికార కూటమిలోలేని వేరొక పార్టీ అభ్యర్థికి ప్రధానమంత్రి ప్రపంచ మద్దతు పలకడంతో రెండునెలల క్రితమే కొలువుదీరిన ప్రభుత్వం కూలే పరిస్థితులు నెలకొన్నాయి. నేపాల్ పార్లమెంట్‌లో పార్టీల ప్రస్తుత బలాబలాల ప్రకారం ఈ ఎనిమిది పార్టీలు బలపరిచే అభ్యర్థే వచ్చే నెలలో జరిగే దేశాధ్యక్ష ఎన్నికల్లో గెలుస్తారు. ప్రచండ నిర్ణయంతో ఆగ్రహించిన అధికార కూటమిలోని నేషనల్ డెమొక్రటిక్ పార్టీ తాము ప్రభుత్వం నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ లింగ్డెన్ ఉప ప్రధానిగా రాజీనామా చేశారు. కూటమి పార్టీలు మద్దతు ఉపసంహరిస్తే నెలరోజుల్లోపు పార్లమెంట్‌లో ప్రచండ విశ్వాస పరీక్షలో నెగ్గాలి.

శాంతి ప్రక్రియలో భాగస్వామ్యానికి సిద్ధం

- ఉక్రెయిన్ సంక్షోభంపై మోదీ
- జర్మనీ చాన్స్‌లర్ షోల్జ్‌తో భేటీ



రాష్ట్రపతి ముర్ముతో షోల్జ్

న్యూఢిల్లీ: ఉక్రెయిన్ సంక్షోభాన్ని చర్చలు, దౌత్యమార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని భారత్ పదేపదే చెబుతోందని ప్రధాని మోదీ చెప్పారు. ఇందుకు సంబంధించిన ఎలాంటి శాంతి ప్రక్రియలోనైనా భాగస్వామిగా మారేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఢిల్లీలో శనివారం జర్మన్ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్‌తో చర్చలు జరిపారు. ఏడాదిగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ సంక్షోభం పర్యవసానాలు ముఖ్యంగా ఆహారం, ఇంధన భద్రత వంటి పలు అంశాలతో వాణిజ్యం, పెట్టుబడులు, నూతన సాంకేతికతలు, వాతావరణ మార్పు వంటి అంశాల్లో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో షోల్జ్..'ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ తీవ్ర విపత్తు, ఇది ప్రపంచంపై విపరీత దుష్ప్రభావాలను కలుగజేసింది. ఈ అంశంపై ఐక్యరాజ్య సమితి సహా అన్ని వేదికలపై మనం వేసే అడుగులపై స్పష్టత అవసరం'అని పేర్కొన్నారు. హింసామార్గం ద్వారా సరిహద్దులను ఎవరూ మార్చ జాలరని షోల్జ్ పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న స్వేచ్ఛావాణిజ్యం ఒప్పందం(ఎఫ్‌టీఏ), పెట్టుబడుల రక్షణ ఒప్పందాలను సాధ్యమైనంత తొందరగా ఖరారు చేయాలనుకుంటున్నట్లు షోల్జ్ చెప్పారు.

భారత్ వైఖరి మొదట్నుంచీ అదే

'ఉక్రెయిన్ సంక్షోభాన్ని చర్చలు, దౌత్యమార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ మొదట్నుంచీ కోరుతోంది. ఇందుకు సంబంధించి జరిగే శాంతి ప్రక్రియలో పాలుపంచుకునేందుకు సిద్ధంగా ఉంది'అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితిలోనూ ఇదే విషయం కుండబద్దలు కొట్టిందన్నారు. 'భారత్, జర్మనీల మధ్య రక్షణ, భద్రత సహకారం వ్యూహాత్మక భాగస్వామ్యంలో కీలకంగా మారనుంది. ఈ రంగాల్లో మరిన్ని అవకాశాలను అన్వేషించాలి. ఉగ్రవాదం, వేర్పాటు వాదంపై పోరులో భారత్, జర్మనీల మధ్య మంచి సహకారం కొనసాగుతోందని మోదీ అన్నారు. భారత్‌లో రెండు రోజుల పర్యటనకు గాను షోల్జ్ శనివారం ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు.

అమెరికాను వదలని మంచు తుపాను



కాలిఫోర్నియా రాష్ట్రంలోని ఆల్పైన్ మిడోస్ ప్రాంతంలో కొండలా పేరుకుపోయిన మంచు

లాస్‌ఏంజెలెస్: అమెరికాలోని పశ్చిమ రాష్ట్రాలు మంచు తుపాను తాకిడికి విలవిల్లాడుతున్నాయి. దాదాపు 10 లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రహదారులు మూతబడ్డాయి. ఒక్క శుక్రవారమే 300పైగా విమాన సర్వీసులు రద్దవగా, మరో 5 వేల సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. కాలిఫోర్నియా, మిషిగన్ రాష్ట్రాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. సియోర్రా నెవడా, దక్షిణ కాలిఫోర్నియా పర్వత శ్రేణుల్లో 1.5 మీటర్ల మేర మంచు కురియవచ్చని, ఫలితంగా ఆకస్మిక వరదలు సంభవిస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. పశ్చిమ తీరంలోని కీలకమైన నార్త్–సౌత్ హైవేను కలిపే ఇంటర్ స్టేట్ –5ను మూసివేశారు. మిషిగన్‌లో మంచు కురియడంతో కరెంటు లైన్లు తెగిపోయాయి. ఒక దశలో మిషిగన్‌లోని 8.20 లక్షల ఇళ్లకు కరెంటు సరఫరా బందయింది. గత 50 ఏళ్లలో ఇంత తీవ్రంగా ప్రభావం చూపిన మంచు తుపాను ఇదేనని డెట్రాయిట్ విద్యుత్ శాఖాధికారి ఒకరు చెప్పారు. .శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలో భారీ స్థాయిలో మంచుకురియడం చాలా అరుదని శంకర్ క్రిష్ణన్ అనే స్థానికుడు చెప్పారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



నేడు సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించనున్నారు. సర్వమానవాళి శ్రేయస్సు కోసం ఈ కార్యక్రమం జరుగుతుంది.



వేణుగోపాలుని సేవలో తెలంగాణ మంత్రి

గంపలగూడెం: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామిని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు.

నేటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు



మంగళగిరి: పానకాల లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమై మార్చి 7వ తేదీ వరకు జరుగనున్నాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ హనుమంతరావు నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

న్యూస్‌రీల్

28న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 28 తేదీ జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఉపాధి అధికారి డాక్టర్ పీవీ రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బైజూస్, ఇన్నోవా సోర్స్, అపోలో, జోస్ అలూకాస్, టెక్నోటాక్స్ సొల్యూషన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని వివిధ విభాగాల్లో 370 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఫార్మసీ, బీటెక్ విద్యార్హతలు ఉన్న వారు ఈ మేళాలో పాల్గొనాలని కోరారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు 28 తేదీ ఉదయం పది గంటల్లోగా ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్, ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్లలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 80087 42842 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శనివారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. మాచవరానికి చెందిన ఎలిసల శ్రీనివాసరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసి రూ. 1,00,001 విరాళాన్ని అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలు అందచేశారు.


వైద్య పరికరాల కొనుగోలు, వసతుల కల్పనకు నిధులు



మచిలీపట్నంటౌన్: పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ మంజూరు చేసిన రూ. 5.07 కోట్లతో బందరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధి మండలాల్లో వైద్య పరికరాల కొనుగోలు, ఆసుపత్రుల్లో వసతులు కల్పించనున్నామని ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ సబార్డినేట్ కమిటీ చైర్మన్ హోదాలో దేశంలోనే అతి పెద్ద పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ నిధుల నుంచి వైద్యసేవల మెరుగు కోసం సాయం కోరామని పేర్కొన్నారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ, చల్లపల్లి, గూడూరులో ఉన్న సీహెచ్‌సీలలో, గుడివాడ ఏరియా ఆసుపత్రిలో, 522 గ్రామాలకు సంబంధించిన 21 పీహెచ్‌సీల్లో మౌలిక వసతుల కల్పనకు మొదటి విడతగా ఈ నిధులను కేటాయించారన్నారు. ఈ ఆసుపత్రులలో బ్లడ్ ఆటో ఎనలైజర్స్, బ్లడ్ స్టోరేజీ రిఫ్రిజిరేటర్లు, 12 చానల్ ఆటోమెటిక్ ఈసీజీ మిషన్లు, మొబైల్ ఎక్స్‌రే యూనిట్లు, ఆక్సిజన్ సిలిండర్లు, పల్స్ ఆక్సోమీటర్లు, సీవీపీ మానిటరింగ్ తదితర 32 రకాల వైద్య పరికరాలను రూ. 44 లక్షలతో కొనుగోలు చేస్తామని వెల్లడించారు. అవనిగడ్డ, చల్లపల్లి, గూడూరు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో మౌలిక సదుపాయాల కోసం రూ. 14 లక్షలు ఖర్చు చేస్తామని వివరించారు. చిన్నాపురం, చేవెంద్రపాలెం, పెడన, బంటుమిల్లి, పెదతుమ్మిడి, రామాపురం, రుద్రపాక, గుడ్లవల్లేరు, కౌతరం, మోటూరు, పామర్రు, వెంట్రప్రగడ, పెదపారుపూడి, వెలమర్రు, నిమ్మకూరు, కనుమూరు, జమిగొల్వేపల్లి, వీరంకిలాకు, కపిలేశ్వరపురం, చినఓగిరాల, కాటూరు ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులు, పిల్లల వైద్యసహాయం కోసం 13 రకాల వైద్యపరికరాలు, ల్యాబరేటరీలకు సంబంధించి ఐదు పరికరాలు కొనుగోలుకు రూ. 14 లక్షలు వెచ్చించామన్నారు. అవనిగడ్డ, గుడివాడ ఏరియా ఆసుపత్రిలో అల్ట్రా సౌండ్ మిషన్‌లను రూ. 50 లక్షల వ్యయంతో కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వీటిని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

బీసీలంటే చిన్నచూపు కాబట్టే...

- అర్జునుడు ఆస్పత్రిలో ఉంటే ఎవరైనా అలా చేస్తారా?
- మీ దన్ను చూసుకునేగా అలా రెచ్చిపోతోంది
- క్యాడర్, క్యారక్టర్ ఏవీ పట్టించుకోరా?
- బూతులు మాట్లాడితేనే పదవులిచ్చేస్తారా?
- పార్టీ ఆఫీసులపై దాడులు ఎవరివల్ల జరిగాయో ఆలోచించండి
- బాబు వద్ద పట్టాభి తీరుపై టీడీపీ సీనియర్ల గుర్రు
- నష్ట నివారణకే గన్నవరం తక్షణ కమిటీ



'బీసీలు అంటే వెన్నెముక. వెనుకబడిన వర్గాల వారు కాదు' అని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పదే పదే చెబుతున్నారు. ఆ వర్గాలను అదే స్థాయిలో చూస్తున్నారు. పదవుల అంశంలో అంతే ప్రాధాన్యమిస్తున్నారు. బీసీలకు మంచి చేయడంలో వైఎస్సార్ సీపీ అధినేతకు యావత్ భారతదేశంలో మంచి గుర్తింపు వచ్చింది. ఆదరణ లభిస్తోంది.

'మరి మన పార్టీలో ఏం జరిగింది. ఇప్పుడేం జరుగుతోంది. బీసీలు అన్నింటినీ బేరీజు వేసుకుంటున్నారు. మాటలతో మనం ఇంకెంత కాలం మభ్యపెట్టగలం' అని టీడీపీ అధినేత చంద్రబాబు వద్ద ఆ పార్టీకి చెందిన సీనియర్లు వాపోయారు. గన్నవరంలో చోటుచేసుకున్న తాజా పరిణామాల నేపథ్యంలో బీసీ వర్గాల ముఖ్యనేతల అంతర్గత చర్చల్లో వచ్చిన అంశాలు అధినేత చెవికి చేరాయి. దీనిపై తీవ్రంగా కలత చెందిన చంద్రబాబు తక్షణ నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించారు.

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: 'గన్నవరం నియోజకవర్గ ఇంచార్జి బచ్చుల అర్జునుడు తీవ్ర అస్వస్థతలో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా తగుదునమ్మా అంటూ నేను వస్తున్నా. నేనే పోటీచేస్తా అంటూ పట్టాభిరాం అక్కడకు ఎలా వెళతారు. అర్జునుడు బీసీ వర్గానికి చెందినందునే అంత ధీమాగా, బహిరంగంగా ఆయన చాలెంజ్ చేయగలిగారు. అదే పార్టీలో బలమైన సామాజికవర్గానికి చెందిన వారు అక్కడ ఇంచార్జిగా ఉన్నట్లయితే ఆ మాట అనగలిగే వారా? సామాజికవర్గం అండ చూసుకునే రెచ్చిపోయారు. మీ దన్ను అంతలా ఉండబట్టే పట్టాభి ఆ స్థాయిలో రెచ్చిపోతున్నారనేది పార్టీలో మెజార్టీ అభిప్రాయం' అని టీడీపీ సీనియర్లు అనడంతో చంద్రబాబు కంగుతిన్నారనేది సమాచారం. 'క్యాడర్, క్యారక్టర్ ఏవీ పట్టించుకోకుండా ఇష్టానుసారం బూతులు మాట్లాడిన వారికి పదవులు ఇచ్చేస్తారనేది ముఖ్య శ్రేణులు భావిస్తున్నాయి. మంగళగిరి, గన్నవరం పార్టీ ఆఫీసులపై దాడులు ఎవరివల్ల జరిగాయి? ఎందువల్ల జరిగాయో మీరే విశ్లేషించుకోండి' అని పార్టీ నాయకులు అనడంతో బాబు ఆలోచనల్లో పడ్డారని తెలిసింది. అయినా కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనకళ్ల నారాయణ, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తదితర బీసీ వర్గానికి చెందిన నాయకులు ఉన్నారు. గన్నవరంలో పార్టీకి ఏదైనా సమస్య ఉందని భావిస్తే అర్జునుడు తీవ్ర అస్వస్థతో ఉన్నందున కొనకళ్ల, కొల్లు, లేదా బచ్చుల కుమారుడు, మరెవరినైనా సీనియర్లను అక్కడకు పంపి ఉండవచ్చు. కానీ పట్టాభిని పంపి రెచ్చగొట్టించడాన్ని బట్టి బీసీలంటే మీకు చిన్నచూపు ఉందనే భావన ప్రజల్లోకి, పార్టీ క్యాడర్‌లోకి బాగా వెళ్లిపోయిందని వివరించడంతో బాబు కంగుతిన్నారని సీనియర్ నాయకుడు 'సాక్షి'కి తెలిపారు. బీసీల గురించి చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన ఎంతమేరకు ఉందనేది బేరీజు వేసుకుంటున్నారని కూడా అన్నారనేది సమాచారం.

మాటలు చెపితే సరిపోదు...

'ఎమ్మెల్సీల్లో బీసీలకు జగన్ ఇచ్చిన ప్రాధాన్యతపై మా వెనుకబడిన వర్గాల్లో బాగా చర్చ జరుగుతోంది. అంతకుముందు కూడా వివిధ పదవుల్లో దక్కిన ప్రాధాన్యతను ఇప్పటికే గుర్తించారు. ఇక నుంచి మీకు మేమంత చేశాం.. ఇంత చేసేశాం.. అని టీడీపీ చెపితే వినే దశలో బీసీ వర్గాలు లేవు. అన్నీ విశ్లేషించుకుంటున్నాయి. గణాంకాలతో సహా ముఖ్యులకే పాఠాలు అప్పజెపుతాయి' అని విజయవాడకు చెందిన బీసీ ముఖ్య నాయకుడు ఒకరు కుండబద్దలు కొట్టారు.

గన్నవర్గానికి కో- ఆర్డినేటర్ కమిటీ

చంద్రబాబు ఆదేశాల మేరకు గన్నవరం నియోజకవర్గానికి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శుక్రవారం కమిటీని నియమించారు. కమిటీ కో-ఆర్డినేటర్‌గా కొనకళ్ల నారాయణ, సభ్యులుగా బచ్చుల అర్జునుడు కుమారుడు బచ్చుల సుబ్రహ్మణ్యంతోపాటు మరో నలుగురికి చోటు కల్పించారు.



సీఐ తలకు అయిన గాయం

సీఐ కనకారావుపై చేసిన దాడిని పోలీసువర్గాలు తీవ్రంగా భావిస్తున్నాయని. టీడీపీ అల్లరిమూకలు ఇంతలా బరితెగిస్తాయని అనుకోలేదని వారంటున్నారని చంద్రబాబు దృష్టికి పలువురు తీసుకెళ్లారు. సంఘటన జరిగినప్పుడు గాయం తీవ్రత బాగా తెలిసిందని, ఏడు కుట్లు పడ్డాయని వివరించారు.

చిన్న తిరునాళ్లకు పక్కాగా ఏర్పాట్లు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల విజయవంతానికి అందరూ సమన్వయంగా వ్యవహరించి పక్కాగా ఏర్పాట్లుచేయాలని నందిగామ ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. మార్చి 7 నుంచి 11 వరకు ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించి శనివారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. మార్చి 9 న పుట్టింటి పసుపు-కుంకుమ బండ్లకు విద్యుత్ దీప కాంతులు ఏర్పాటు చేసే సందర్భంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఆలయం వద్ద పలు శాఖల సమాచార కేంద్రాలతో పాటు, తాగునీటి సౌకర్యం, తాత్కాలికంగా బస్టాండ్‌ల ఏర్పాటు ఉంటుందన్నారు. తిరునాళ్లకు ముందు రోజు కల్లా అన్ని శాఖల అధికారులు వారి యాక్షన్ ప్లాన్‌తో పాటు, ఫోన్ నెంబర్లను ఆలయ అధికారులకు, రెవిన్యూ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఆలయ ఈఓ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మునేటిలో భక్తులకు జల్లు స్నానాల ఏర్పాటు చేశామని వెల్లడించారు. అలానే మునేరులో తాత్కాలిక కేశఖండనశాల ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం తిరునాళ్ల ఉత్సవాల పోస్టర్‌ను అధికారులు, పాలకవర్గ సభ్యులు ఆవిష్కరించారు. తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, ఆలయ ఈఈ వైకుంఠరావు, వైద్యాధికారి సుజన, విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు, ఎస్ఐ హరిప్రసాద్, జగ్గయ్యపేట ఆర్టీసీ డీఎం ప్రసాద్, గ్రామ కార్యదర్శి శ్యామ్, పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని అమ్మవారి ఆలయ ప్రాంగణ కళావేదికపై వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఉత్సవమూర్తులకు శనివారం ఆలయ అర్చకులు వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బుద్దా రాంబాబు, చింకా శ్రీనివాస్, బచ్చు మాధవికృష్ణతో పాటు పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవం వీక్షించిన భక్తుల ఇంట సకల శుభాలు కలుగుతాయని, సంతాన యోగం, వివాహాలు కాని వారికి వివాహాలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

సంక్షేమ పథకాలతోనే సమగ్రాభివృద్ధి



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు కైలే, సింహాద్రి, ప్రతాప్ అప్పారావు



మాట్లాడుతున్న హారిక చిత్రంలో సీఈవో శ్రీనివాసరావు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు ఢిల్లీరావు, రంజిత్‌బాషా, విప్ ఉదయభాను

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందడంతోనే సమగ్రాభివృద్ధి జరుగుతోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తెలిపారు. జెడ్పీ సర్వసభ్య సమావేశం స్థానిక కన్వెన్షన్ హాల్లో హారిక అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమం, సాధికారత, విద్య తదితర రంగాల అభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట వేసి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి అంటే భవనాలు, రోడ్లు వేయటమే కాదని కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చడం కూడా అని పేర్కొన్నారు. గత ఏడాది నవంబర్ 4న జరిగిన సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ హారిక దృష్టికి సభ్యులు తీసుకొచ్చిన పలు అంశాలపై జిల్లా అధికారులు తీసుకున్న చర్యల వివరాలను జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు సభకు వివరించారు. విద్యాశాఖపై జరిగిన చర్చలో కృత్తివెన్ను, పెనుగంచిప్రోలు, గంపలగూడెం, జి.కొండూరు, కోడూరు, తిరువూరు, గన్నవరం, ముసునూరు, ఎ.కొండూరు, మైలవరం, విజయవాడరూరల్, పెనుగంచిప్రోలు, కైకలూరు, బాపులపాడు, తోట్లవల్లూరు మండలాల జెడ్పీటీసీలు మాట్లాడుతూ నాడు - నేడు తరగతి గదుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు పి.రంజిత్‌బాషా, ఢిల్లీరావు, డీఈవోలు స్పందించి పనులు వేగవంతం చేయిస్తామన్నారు. గన్నవరం, కృత్తివెన్ను, ఎ.కొండూరు, పెనుగంచిప్రోలు, పెడన, నూజివీడు, అవనిగడ్డ, విజయవాడరూరల్‌కు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు వారి పరిధిలోని గ్రామాల్లో ఉన్న తాగునీటి సమస్య, తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు వివరించారు. దీనికి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బదులిస్తూ ఈ వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. జిల్లాలోని 343 గ్రామాలను తాగునీటి సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని వెల్లడించారు. రూ. 3.10 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించారు.

పనుల్లో వేగం పెంచాలి...

ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ నాడు - నేడు పథకంలో భాగంగా పాఠశాలల అభివృద్ధి పనులు వేగంగా చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ, ఎంఈవోలు శ్రద్ధ వహించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎన్ఎస్‌పీ కాలువ పరిధిలోని ప్రజాప్రతినిధులతో త్వరలో ఏలూరులో సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు సక్రమంగా నిర్వహించటం హర్షణీయమని చెప్పారు. రైస్‌మిల్లుల కెపాసిటీకి మించి ధాన్యం ఇచ్చే పద్ధతికి స్వస్తి పలకాలని సూచించారు. గరికపర్రు పీహెచ్‌సీ మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినా డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి సమగ్ర సమాచారం లేకుండా మాట్లాడటం శోచనీయమన్నారు. జగనన్న కాలనీలో మెరక పనులు పూర్తి చేసి గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీ...

నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ విజయవాడలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు పేదలను దోచుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం అమల్లో ఉన్నా లేదంటూ రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేలను పిలిస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవచ్చని ఆయన చెప్పారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఉన్న భూమిని జిల్లా పరిషత్ పాఠశాలకు, పాఠశాల భూమిని ఆలయానికి బదలాయిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని కోరారు. అవనిగడ్డలోని గాంధీ క్షేత్రానికి 99 సంవత్సరాల లీజు పేరుతో ఎకరం భూమి తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో టీడీపీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. జిల్లా పరిషత్‌కు చెందిన ఈ స్థల లీజును రద్దు చేసి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

పోలీస్ కమిషనరేట్‌కు టెక్నాలజీ ఎక్స్‌లెన్స్ అవార్డు

కొచ్చిలో జరిగిన సభలో అవార్డు అందుకున్న డీసీపీ ప్రశాంతి



ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్న డీసీపీ మేరీ ప్రశాంతి

విజయవాడ స్పోర్ట్స్: ప్రతిష్టాత్మక సాంకేతిక ప్రతిభ పురస్కారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌ను వరించింది. అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ నేరాలను ఛేదించి, నిందితులను అదుపులోకి తీసుకున్నందుకు గానూ 'యునైటెడ్ కమ్యూనికేషన్' విభాగంలో ఎక్స్‌లెన్స్ కంప్యూటర్స్ సంస్థ జిల్లా పోలీస్ కమిషనరేట్‌ను ఈ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేసింది. కేరళలోని కొచ్చిలో జరిగిన టెక్నాలజీ జాతీయ సెమినార్‌లో డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) మేరీ ప్రశాంతి ఈ అవార్డును అందుకున్నారు. జిల్లాలోని సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసిన విషయం తెలిసిందే. ఫలితంగా పలు ప్రాంతాల్లో నేరాలు జరిగిన తీరును వెంటనే గుర్తించి, ఆధారాలను సేకరించి, కేసులు నమోదు చేస్తున్నారు. నగరంతో పాటు, నగరానికి అనుసంధానంగా ఉన్న జాతీయ రహదారుల్లో స్తంభించిన ట్రాఫిక్‌ను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవడం, దసరా, భవానీదీక్షల విరమణ, వినాయక చవితి, గుణదల మేరీ మాత ఉత్సవాలు, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలు, పలు ప్రభుత్వ కార్యక్రమాలు, వీవీఐపీ, వీఐపీలు పర్యటనల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నపుడు అత్యవసర వాహనాలకు వెంటనే దారి ఇచ్చేలా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తూ ముందస్తు భద్రత చర్యలు తీసుకుంటున్నారు. అసాంఘిక శక్తుల కదలికలను సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూం సిబ్బంది పసిగట్టి సమాచారాన్ని పోలీసు ఉన్నతాధికారులకు వెంటనే చేరవేయడంతో జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. డ్రోన్, బాడీ బాడీ వార్న్ కెమెరాలను వినియోగించి అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా పెట్టారు. ప్రతిష్టాత్మకమైన అవార్డు కమిషనరేట్‌కు రావడం జిల్లాకు గర్వకారణమని కమిషనర్ టీకే రాణా తెలిపారు.

తాడేపల్లిలో నేడు ఈత పోటీలు

తాడేపల్లిరూరల్: ఆక్వాడెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ మందపాటి లక్ష్మీ నరసరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 సంవత్సరాలుగా ఆక్వాడెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈతల పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అసోసియేషన్ లైఫ్ చైర్మన్ గోకరాజు గంగరాజు పర్యవేక్షణలో ఉదయం 6 గంటలకు దుర్గాఘాట్ నుంచి కృష్ణానది దక్షిణం వైపు లోటస్ ఫుడ్ సిటీ వరకు 1.5 కి.మీ. పొడవున పోటీలుంటాయని చెప్పారు. పాల్గొనే వారిని ఐదు గ్రూపులుగా విభించామన్నారు.

అటవీ సంరక్షణ నియమాలతో పర్యావరణ విధ్వంసం

న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్యా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అటవీ సంరక్షణ నియమాలు– 2022 వల్ల పర్యావరణ విధ్వంసంతో పాటు ఆదివాసీల జీవన మనుగడ ప్రమాదంలో పడుతుందని, వాటిని వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు పి.టాన్యా పిలుపునిచ్చారు. అటవీ సంరక్షణ నియమాలకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో శనివారం సీపీఐ(ఎం ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'అటవీ సంరక్షణ నియమాలు – 2022' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నగర కార్యదర్శి ఎం.రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సదస్సులో పాల్గొన్న పి.టాన్యా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఈ దేశ ఖనిజ వనరులను బహుళ జాతి సంస్థలకు, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు అటవీ సంరక్షణ నియమాలు – 2022 తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ నియమాలు అమల్లోకి వస్తే 8 కోట్ల మంది ఆదివాసీలు నిర్వాసితులై సర్వం కోల్పోతారని తెలిపారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మేకల ప్రసాద్, ప్రకాష్, పీఓ డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆర్.భీమశంకర్, ఇఫ్టూ నగర అధ్యక్షుడు ఆర్.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న టాన్యా

కానూరులో వృద్ధురాలి హత్య


హత్యకు గురైన చాగంటిపాటి సుమతీదేవి

పెనమలూరు: కానూరులో ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. హత్య జరిగిన ఇంట్లో సీసీ కెమెరా అదృశ్యం అవటం, బంగారు ఆభరణాలు చోరీ జరగటంతో హత్య మిస్టరీగా మారింది. పెనమలూరు సీఐ గోవిందరాజు, మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. కానూరు చలసానినగర్ రెండవ లైన్‌లో చాగంటిపాటి సుమతీదేవి (81) ఒంటరిగా ఉంటోంది. సుమతీదేవిని చూసుకోవడానికి ఆమె కుటుంబసభ్యులు నాలుగు నెలల క్రితం ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నందిగామకు చెందిన కేర్‌టేకర్ చింతల మల్లేశ్వరిని నియమించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉద యం సుమతీదేవి అల్లుడు పెదప్రోలు శివశంకర్‌రావు ఇంటికి వచ్చి తలుపు కొట్టగా, ఎవరూ తలుపు తీయకపోవటంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులను పిలిచి కిటికీ నుంచి చూస్తే హాల్‌లో సుమతీదేవి, కేర్‌టేకర్ మల్లేశ్వరి నేలపై పడి ఉన్నారు. కిచెన్ వైపు తలుపు తెరచి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి మల్లేశ్వరిపై నీరు చల్లగా ఆమె లేచింది. అయితే సుమతీదేవి మాత్రం మరణించి ఉంది. పోలీసులు కేర్‌టేకర్ మల్లేశ్వరిని ప్రశ్నించగా శనివారం అర్ధరాత్రి తాను ఇంటి బయట ఉన్న బాత్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో ఇద్దరు దుండగులు వచ్చి తనను ఇంట్లోకి తీసుకువెళ్లి దాడి చేయటంతో స్పృహ కోల్పోయానని తెలిపింది. ఆ తరువాత ఏం జరిగిందో తనకు తెలియదని తెలిపింది.

కేర్‌టేకర్ పైనే అనుమానాలు?

సుమతీదేవి అల్లుడు శివశంకర్‌రావు కేర్‌టేకర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరా శుక్రవారం సాయంత్రం నుంచే పని చేయలేదని, సీసీ కెమెరా సైతం మాయమైందని పోలీసుల దృష్టికి తీసుకు వచ్చారు. ఇంటి బయట ఉన్న సీసీ కెమెరాలో బయట వ్యక్తులు ఎవరూ వచ్చినట్లు రికార్డు కాలేదని, ఇంట్లో రూ.4 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాల చోరీ జరగటంతో కేర్‌టేకర్‌పై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రియుడితో కలసి భర్తను హత్య చేసిన భార్య

వివాహేతర సంబంధం నేపథ్యంలో కంచికచర్లలో దారుణం


హత్యకు గురైన కుంచం రామారావు (ఫైల్)


భార్య భార్గవి


ప్రియుడు ప్రవీణ్ కుమార్

కంచికచర్ల: కంచికచర్లలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన హత్య పట్టణంలో కలకలం రేపింది. నందిగామ రూరల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ కథనం మేరకు వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన కుంచం రామారావు(47) తన భార్య పిల్లలతో కంచికచర్ల పెద్ద బజారులోని పోస్టాఫీసు రోడ్డులో అద్దెకుంటున్నాడు. రామారావు స్వగ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య భార్గవి కంచికచర్ల మండలం మోగులూరు గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తుంది. వారికి సంతానం లేకపోవటంతో పదేళ్ల క్రితం రామారావు తమ్ముడు శ్రీను చిన్న కుమార్తె జోహారికను పెంచుకుంటున్నారు. ఐదేళ్ల తర్వాత భార్గవికి సుస్మిత అనే పాప పుట్టింది. రామారావు గతంలో జేసీబీ ఉండేది. దానిపై జుజ్జూరు గ్రామానికి చెందిన మోగులూరు ప్రవీణ్‌కుమార్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఆ సమయంలోనే డ్రైవర్ ప్రవీణ్‌కుమార్ తన యజమాని రామారావు భార్య భార్గవితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అప్పటినుంచి ప్రవీణ్‌కుమార్ తరచుగా రామారావు ఇంటికి వస్తుండేవాడు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం అర్ధ రాత్రి ప్రవీణ్ రామారావు ఇంటికి రాగా రామారావు అతడిని మందలించాడు. దీంతో రామారావు భార్య భార్గవి, ఆమె ప్రియుడు ప్రవీణ్, అతని స్నేహితులు మోగులూరు బుజ్జిబాబు, పులి సురేష్ కలసి రామారావుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. విషయం గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనానికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని వైద్యం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 3.35 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. సీఐ నాగేంద్రకుమార్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రామారావు సోదరుడు కుంచం శ్రీను ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు

ఏర్పాట్లు పూర్తి


రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర స్థాయి మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలు జగ్గయ్యపేటలోని ఎస్‌జీఎస్ కళాశాలలో ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు దాదాపుగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. కళాశాల గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ తదితర నేతలు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సోదరుడైన సామినేని వెంకట మల్లికార్జున ప్రసాద్ (ఎస్‌వీఎం ప్రసాద్) మెమోరియల్ పేరుతో జరిగే ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి ప్రముఖ జట్లు రానున్నాయని తెలిపారు. ఈ పోటీలను ఈనెల 27 వ తేదీన రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత ప్రారంభిస్తారని, చివరి రోజు మార్చి 1 న బహుమతి ప్రదానోత్సవానికి రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా రానున్నారని తెలిపారు. విజేతలకు వరుసగా రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.25 వేల చొప్పున బహుమతులు అందజేస్తామని, పెద్ద సంఖ్యలో వచ్చే క్రీడాభిమానుల కోసం గ్యాలరీలు తదితర సౌకర్యాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు పూసాల పుల్లారావు, ఆకుల నాని, శేషం ప్రసాద్, చిరంజీవి, సీఐ నాగమురళి, ఎస్ఐ రామారావు పాల్గొన్నారు.

యువకుడికి దేహశుద్ధి

గన్నవరం: ఓ యువతి వివాహాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నించిన యువకుడికి ఆమె కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేసిన ఘటన గన్నవరంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బీబీగూడెం గ్రామానికి చెందిన ఈడ్పుగంటి రాంబాబు కొంతకాలంగా ఓ యువతి వెంటపడి వేధిస్తున్నాడు. ఆ యువతికి వేరే యువకుడితో ఈ నెల ఈ 22న పెళ్లి జరగాల్సి ఉండగా, ఆ రోజు ఉదయం పెళ్లి కుమారుడి ఇంటికి వెళ్లిన రాంబాబు ఆ యువతి, తాను ప్రేమించుకుంటున్నామని చెప్పడంతో వివాహం రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో శనివారం గన్నవరం పంచాయతీ కార్యాలయానికి వచ్చిన రాంబాబును యువతి కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేశారు.

లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పటమట ఎస్ఐ పద్మ

ఆటోనగర్(విజయవాడతూర్పు): లారీ ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పటమట ఎస్ఐ పద్మ తెవివరాల మేరకు.. బ్లూ రంగు షర్ట్, నల్లప్యాంట్ ధరించుకున్న గుర్తుతెలియని వ్యక్తి మద్యం సేవించి ఆటోనగర్‌లోని పంటకాలువ రోడ్డు వాటర్ సర్వీసింగ్ షాపు పక్కన నిద్రపోతున్నాడు. ఇదే సమయంలో పంటకాలువ వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ ఆ వ్యక్తిని గమనించలేదు. అతనిని ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై మృతిచెందాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని సీసీ పుటేజ్ ద్వారా స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ ప్రకాష్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

Dr. YSR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P
VIJAYAWADA – 520 008

No. 16/We/T8/DM2/22 TENDER NOTICE Date: 25.02.2023

Sealed Tenders are invited for the following work at Dr.YSR University of Health Sciences, Vijayawada.

Sl.No.	Name of the work
1	Maintenance of indoor plants and Outdoor plants, lawns, trees, palms, shrubs, Sprinkler system etc., at Dr. YSR UHS, Vijayawada for the years 2023-2024 & 2024-2025

Note: For further details visit www.apeprocurement.gov.in Sd/- (Dr. V. Radhika Reddy) REGISTRAR

LEPAKSHI HANDICRAFTS EMPORIUM, Vijayawada

Name of the work:- LHE, Vijayawada is inviting Sealed Quotations. Submit the Quotations by 28-02-2023 at 5 pm. for Lepakshi Thematic Exhibition erection of stalls at Bapu Museum, M.G. Road in Vijayawada. The details are up-loaded in the official web site i.e. https://lepakshihandicrafts.gov.in/tenders.html For any further clarification please visit our web site

MANAGER, LHE, Vijayawada

కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్., మచిలీపట్నం
టెండరు ప్రకటన

గుడ్లవల్లేరు గ్రామములో, డోర్ నెం:4–89 నందు గల మా బ్యాంకునకు చెందిన పురాతన భవనమును పడగొట్టి, మెటీరియల్ తీసుకొని, స్థలమును చదునుచేసి బ్యాంకునకు అప్పగించుటతో పాటు, ఎంత మొత్తమును బ్యాంకునకు చెల్లించగలరో తెలుపుటకు సీల్డు టెండర్లను కోరడమైనది. రూ.300/– లను చెల్లించి, టెండరు ఫారమును ప్రాంతీయ కార్యాలయము, విజయవాడ, మచిలీపట్నం కేంద్ర కార్యాలయము నందు ఉన్న కేర్ టేకర్లు మరియు గుడ్లవల్లేరు బ్రాంచి మేనేజరు నుండి తేది. 27-02-2023 నుండి తేది. 04-03-2023 వరకు పొందవచ్చును.

Contact No: 9949688378 - Manager, Gudlavalleru
9949688360 - Caretaker, Machilipatnam
9949688340 - Chief Manager, R.O, Vijayawada.

మచిలీపట్నం
తేది: 24-02-2023

(సం/–) ఎ.శ్యామ్‌మనోహర్
ముఖ్య కార్యనిర్వహణాధికారి

క్లుప్తంగా

ఆర్థిక సహాయం అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు అనారోగ్యంతో బాధపడుతుండగా, వారికి దేవినేని నెహ్రూ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గంలోని 21వ డివిజన్‌కు చెందిన ఈశ్వరరావు, 11వ డివిజన్‌కు చెందిన భగవాన్ రాములు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ట్రస్ట్ ప్రతినిధులు ఆస్పత్రికి వెళ్లి రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ పుష్పాల కుమారి, 11వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి పర్వతనేని పవన్, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

టిఫిన్ బండి పంపిణీ



గుణదల(విజయవాడతూర్పు): పేదలకు భరోసా కల్పించే దిశగా దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని 4వ డివిజన్ ఇన్‌చార్జి గల్లా పద్మావతి అన్నారు. భారతీనగర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో విష్ణు ప్రియ అనే మహిళకు టిఫిన్ బండి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ.. పేదలకు జీవనోపాధి నిమిత్తం నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ విశేషంగా కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గం పరిధిలో పెద్ద సంఖ్యలో టిఫిన్ బండ్లు, ఇస్త్రీ బండ్లు అందజేశామని చెప్పారు. ప్రజలకు సేవ చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా, సామాజిక కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గల్లా రవి, నాయకులు శంకరరావు, తరుణ్, సునీత, రుబీన పాల్గొన్నారు.

రంజింప చేసిన ఆంధ్ర నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం ఆంధ్ర నృత్య ప్రదర్శన జరిగింది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు కళాకారులు ఆంధ్రనాట్యాన్ని ప్రదర్శించారు. రాయన శ్రీనివాసరావు శిష్యబృందం పలు కీర్తనలకు నాట్య ప్రదర్శన చేశారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు, తీర్థప్రసాదాలను అందజేశారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



ఆటోనగర్(విజయవాడతూర్పు): వంద అడుగుల రోడ్డు సన్‌లైట్ సమీపంలో మురుగు నీరంతా ప్రధాన రహదారి మీదకు పారుతోంది. దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. అన్ని దుకాణాల ముందు సిమెంట్ బండలు వేయడంతో చుక్కమురుగు నీరు కూడా బయటకు వెళ్లని పరిస్థితి నెలకొంది. ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

4 నుంచి మహిళా ఉత్సవ్-2023

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మార్చి 4 నుంచి 12 తేదీ వరకు మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాల్‌లో మహిళా ఉత్సవ్-2023 నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ప్రకటనలో తెలిపారు. మహిళలు తయారు చేసిన ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్, ఎంబ్రాయిడరీ చీరలు, ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, జూట్ బ్యాగుల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, బొమ్మల తయారీ మొదలైన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయన్నారు. మహిళా ఉత్సవ్‌లో తమ ఉత్పత్తులను విక్రయించాలనుకునే వారు ఈ నెల 28వ తేదీ మంగళవారంలోపు మొగల్రాజపురం, రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

ఆకలి తీరుస్తున్న అన్న సంతర్పణ సమితి ట్రస్ట్



భోజనాలు వడ్డిస్తున్న అన్నసంతర్పణ సేవా సమితి సభ్యులు(ఫైల్)

- 2021లో ట్రస్ట్ ఏర్పాటు
- 180 మంది వ్యవస్థాపక సభ్యులు
- రోజుకు 400 మందికిపైగా అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మనిషి మనుగడ ఆహారంపై ఆధారపడి ఉంది. భోజనం లేక ఎంతో మంది ఆకలితో అలమటిస్తున్నారు. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అన్నదానం జీవన్మోక్షికి సోపానం. జీవులకు తాను అన్నమై ఉన్నానని భగవద్గీతలో స్వయంగా శ్రీకృష్ణుడు చెప్పాడు. అన్నార్తుల ఆకలి తీర్చడంతో ఆ పరమాత్ముడిని చేరడానికి సులువైన మార్గమని నమ్మి అన్న సంతర్పణ సమితి ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి అన్నార్తుల ఆకలి తీరుస్తున్నారు. ట్రస్ట్ ద్వారా కొన్ని వందల మందికి దాతలు, వలంటీర్లు సభ్యులుగా చేర్చి నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో 400 మందికిపైగా పేదలకు, భక్తులకు ప్రతి రోజు అన్నదానం చేస్తున్నారు.

తొమ్మిది మందితో ప్రారంభమై..

2021వ సంవత్సరం మే 23న కోవిడ్ సెకండ్ వేవ్‌లో కేవలం తొమ్మిది మందితో ప్రారంభమైంది. దాతలు తమ పెళ్లిరోజు, పుట్టినరోజు, పెద్దలు జయంతి, వర్ధంతి ఇలా అనేక కార్యక్రమాలకి వారే స్వయంగా వచ్చి తమ స్వహస్తాలతో వేడి వేడి అన్నం, కూరలు వడ్డించి తృప్తిచెందుతున్నారు.

గురువు స్ఫూర్తితో..

రెండేళ్లుగా గుండు దిలీప్ గురువు చిత్ర స్టూడియోస్ అధినేత మద్ది వెంకట రామ మోహనరావు ఇచ్చిన ధైర్యంతో ప్రతి రోజు 100 మందికి అన్నం పెడదామని మొదలుపెట్టిన మహాయజ్ఞం ఈ రోజు అందరి సహాయంతో కొన్ని వందల మందికి అన్నం ప్రతిరోజూ పెడుతున్నారు. దాతల సహాయంతో వీలైనంత ఎక్కువ మందికి పూర్తి భోజనం అందించటమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. తన సొంత వ్యాపారాన్ని సైతం పక్కన పెట్టి ఈ సంస్థ పురోగతికి పూనుకున్నారు గుండు దిలీప్. వారి సేవలు మెచ్చి 180 మంది వ్యవస్థాపక సభ్యులుగా చేరడమే కాక, శ్రీదేవి సాంస్కృతిక సంఘం ద్వారా డొక్క సీతమ్మ అవార్డు, ఆసియా వేదిక్ కల్చరల్ యూనివర్సిటీ, హోసూర్ గౌరవ డాక్టరేట్ అందించారు.

దుప్పట్లు, చెప్పుల పంపిణీ

వృద్ధులు, అనాథలు, దివ్యాంగులకు ట్రస్ట్ ద్వారా దుప్పట్లు, చెప్పులు అందజేస్తున్నారు. పిల్లలో నైపుణ్యత పెంపొందించేందుకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నారు. త్వరలో అధునాతన సౌకర్యాలతో వంటశాల ఏర్పాటు చేసి ఇంకా ఎక్కువ మందికి భోజనం ఉచితంగా అందించటానికి కృషి చేస్తున్నట్లు దిలీప్ తెలిపారు.

దేశాభివృద్ధిలో సీఏల పాత్ర కీలకం



ఐసీఏఐ విజయవాడ అసోసియేషన్ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

గుణదల(విజయవాడతూర్పు): దేశాభివృద్ధిలో చార్టెడ్ ఎకౌంటెంట్స్ కీలక పాత్ర పోషిస్తున్నారని సివిల్ సప్లైయ్, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. చార్టెడ్ ఎకౌంటెంట్స్ విజయవాడ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురునానక్ కాలనీలోని ఎస్‌ఏసీ కల్యాణ మండపంలో శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. చార్టెడ్ ఎకౌంటెంట్స్ తమ విభాగంలో మెరుగైన సేవలందించాలని కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ట పరచటంలో చార్టెడ్ ఎకౌంటెంట్స్ నిబద్ధతగా పనిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా చిన్న తరహా పరిశ్రమలకు తోడ్పాటు అందించాలని సూచించారు. విజయవాడ బ్రాంచ్ వరుసగా మూడో సారి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. విజయవాడ నూతన కమిటీ చైర్మన్‌గా వీర్ల నరేంద్రబాబు, వైస్ చైర్మన్‌గా నిట్ట రవికిషోర్, కార్యదర్శిగా కంచమరెడ్డి నారాయణ, కోశాధికారిగా ఉప్పులూరి జయంత్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ అభివృద్ధికి శక్తి వంఛన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. దక్షిణ భారత ప్రాంత చైర్మన్ పున్నారాజ్, సీఏలు ప్రసన్న కుమార్, శ్రీధర్, చిన్న మస్తాన్, సునీల్‌కుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.

మెషీన్ లెర్నింగ్‌పై అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉపేంద్రరావు, ఫాదర్ రవీంద్ర

గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులు వైజ్ఞానిక అంశాలపై అవగాహన కలిగి ప్రతిభావంతులుగా ఎదగాలని చిప్ ఎలక్ట్రానిక్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉపేంద్రరావు అన్నారు. ఆంధ్రలయోల ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న మెషీన్ లెర్నింగ్ వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కరెంట్ ఎఫైర్స్‌ను తెలుకోవాలని సూచించారు. మెషీన్ లెర్నింగ్ వంటి సదస్సుల ద్వారా విద్యార్థులకు సంబంధిత అంశాలపై అవగాహన పెరుగుతుందని చెప్పారు.

విశ్లేషణాత్మక అవగాహన..

కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు సిద్ధాంతపరమైన అంశాలను ప్రయోగాత్మకంగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. మార్కులే పరమావధిగా కాకుండా ఆయా అంశాలపై విశ్లేషణాత్మకంగా అవగాహన పెంచుకోవాలని వివరించారు. అనంతరం మెషీన్ లెర్నింగ్‌పై ప్రసంగించారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి రామకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ రవీంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ పరిశీలన



పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో నిత్యం జరిగే ఇంటింటి చెత్తసేకరణ నిర్వహణ విధానం పారదర్శకంగా చేపట్టాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన 4వ డివిజన్‌లోని ఎల్‌బీసీ కాలనీ, ఫిలిం కాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఎటువంటి అవరోధం లేకుండా క్లాప్ వాహనాల ద్వారా నివాసాల నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరగాలన్నారు. డివిజన్ పరిసరాలు అన్నీ నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్‌లో ఇటీవల పూర్తి చేసిన సీసీ రోడ్లను రీబౌండ్ హ్యామర్‌తో నాణ్యతను, రోడ్డు లోతు పరిమాణం నిబంధన ప్రకారం ఉన్నది లేనిది స్వయంగా పరిశీలించి వాటి బిల్లులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన జాతీయ రహదారి వెంబడి ఉన్న సెంట్రల్ డివైడర్ గ్రీనరీని పరిశీలించి మొక్కల మధ్యన ఉన్న గ్యాప్ ఫిల్లింగ్ చేసి ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అక్కడి నుంచి ఆయన 19వ డివిజన్ పున్నమితోట ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన దోభిఖానా షెడ్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కమిషనర్ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు చంద్రశేఖర్, ఏఎస్ఎస్ ప్రసాద్, ఉద్యానవన అధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆక్రితి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



లబ్బీపేట(విజయవాడతూర్పు): మగువుల మనసును దోచే వస్త్రాలతో ఎంజీరోడ్డులోని శ్రీ శేష సాయి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆక్రితి లైఫ్‌స్టైల్ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్రదర్శనలోని దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన పట్టు, ఫ్యాన్సీ, డిజైనర్ చీరలతో 50కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. బ్రైడల్ కలెక్షన్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అన్ని రకాల చీరలు, దుస్తులు, జ్యూవెలరీ, ఇతర కలెక్షన్స్, డిజైనర్ వస్త్రాలు, పార్టీవేర్స్ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ఆదివారం కూడా కొనసాగుతుందని నిర్వాహకురాలు శశి మెహతా తెలిపారు.

వార్డు వలంటీర్లకు రేపు ఇంటర్వ్యూలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ఆయా డివిజన్లలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 13వ దశలో జరిగే ఈ ఎంపికలో 69 మంది వార్డు వలంటీర్లకు ఈ నెల 27వ తేదీన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. ఫోన్ నంబర్ 81859 33187లో సంప్రదించాలని సూచించారు.

గృహ హింస చట్టంపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి బాలకోటేశ్వరరావు

గుణదల(విజయవాడతూర్పు): గృహ హింస చట్టంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి డి.బాలకోటేశ్వరరావు అన్నారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద గల ఓ హోటల్‌లో శనివారం గృహహింస చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మహిళల భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు సాగాలన్నారు. సమాజంలో మహిళలకు సముచిత స్థానం ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా దిశ చట్టం ద్వారా యువతులకు భరోసా కల్పించడం అభినందనీయమన్నారు. గతంతో పోల్చితే గృహ హింస, మహిళలపై వేధింపులు తగ్గాయని తెలిపారు. ఆధునిక సమాజంలో ఆడపిల్లలు విద్యావంతులుగా తమ ప్రతిభ చాటుతున్నారని పేర్కొన్నారు. దీంతో మహిళలకు చట్టాలపై సైతం అవగాహన పెరిగిందన్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆర్గనైజర్ కె.సత్యవతి, ఎల్.ఎస్.కళ్యాణి పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయించాలి



గిరిపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): తల్లిదండ్రులు తమ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. ఆమె శనివారం గిరిపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, పిల్లలకు వేస్తున్న వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ వ్యాక్సిన్ నిల్వలు, సరఫరా, శీతలీకరణ నిర్వాహణ, వ్యాక్సినేషన్ రికార్డులు, లబ్ధిదారుల లిస్టులు పరిశీలించారు. అనంతరం నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యాక్సిన్ కేరియర్‌లో నిల్వ ఉంచడాన్ని పరిశీలించారు. పిల్లలకు టీకాలు వేయించేందుకు వచ్చిన తల్లులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సమీపంలోని గృహాలను సందర్శించి పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయిస్తున్నారో, లేదో పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయించాలని, తల్లులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. పుట్టిన దగ్గర నుంచి ఐదేళ్లు వచ్చే వరకూ క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో గిరిపురం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎస్ఐ ప్రభాకరరావుకు నివాళి

విజయవాడస్పోర్ట్స్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఏఎస్ఐ దేవరపల్లి ప్రభాకరరావు మృతదేహానికి అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు నివాళులర్పించారు. విజయవాడ నగరంలోని ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులో ఈ నెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభాకరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నెల 23న ఆయన మరణించారు. భవానీపురం జోజినగర్‌లో ప్రభాకరరావు నివాస గృహం వద్ద ఆయన మృతదేహాన్ని డీసీపీ సందర్శించి నివాళులర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 25 వేల నగదును ప్రభాకరరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభాకరరావు నగరంలోని సత్యనారాయణపురం, వన్‌టౌన్, ఇబ్రహీంపట్నం, గవర్నర్‌పేట స్టేషన్‌లలో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభాకరరావుకు నివాళులర్పించిన వారిలో ఏడీసీపీ వెంకటరత్నం, ఏసీపీ శ్రీనివాసరావు, పోలీసు అధికారుల సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమయ్య ఉన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



రాణిగారితోట, 18వ డివిజన్‌లో వారధి వెంబడి కొద్దిపాటి స్థలంలో నగర పాలక సంస్థ పార్కుల అభివృద్ధిలో భాగంగా రూ.30 లక్షల వ్యయంతో పార్కును అభివృద్ధి చేశారు. అందులో యువత ఆడుకునేందుకు క్రికెట్ నెట్ ప్రాక్టీస్, వాకింగ్ ట్రాక్, చిన్నారులు ఆడుకునేందుకు వివిధ రకాల ఆట పరికరాలను ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులు క్రికెట్ నెట్ ప్రాక్టీస్, ఆట వస్తువులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న వెంకటేశ్వరరావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యాలను పెంచుకోవాలని ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్(అమ్మ) అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్(బీఎస్ఆర్‌కే) హైస్కూల్ ఆవరణలో గత వారం ఇదే స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఇంటర్నల్ స్పోర్ట్స్‌మీట్‌లో విజేతలైన వారికి శనివారం సాయంత్రం బహుమతులను అందచేశారు. వెంకటేశ్వరరావు హాజరై విజేతలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.నాగరాజు మాట్లాడుతూ.. క్రీడల వల్ల శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని చెప్పారు. 'అమ్మ' ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, కోశాధికారి అన్నే శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమర గాయకుడు ఘంటసాలకు స్వరాభిషేకం



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకులు

విజయవాడకల్చరల్: హైదరాబాద్‌కు చెందిన గోకులం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘంటశాల శత జయంతి ముగింపు వేడుకలు నిర్వహించారు. దుర్గాపురంలోని ఘంటసాల వేంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో శనివారం అమృతగానం- అమృత స్వరం పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. రెండు గంటలపాటు సాగిన కార్యక్రమంలో ఘంటసాల మాష్టరు స్వరపరచిన, ఆయన గానం చేసిన గీతాలను హైదరాబాద్‌కు చెందిన బాల కామేశ్వరరావు, శాంతిశ్రీ, సాయి మేఘన, శిరీష కాకినాడకు చెందిన పీవీ రమణ ఆలపించారు. కార్యక్రమాలను పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు ప్రారంభించారు. కళాకారుల కృషిని అభినందించారు. గోకులం సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు వై.సుబ్రహ్మణ్యం హైదరాబాద్‌లో ప్రతీ నెల కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. గాయకులు బాలకామేశ్వరరావు, పీవీ రమణలను నిర్వాహకులు సత్కరించారు.

ప్రతిభకు ప్రోత్సాహం అందించాలి



